కాశం రాలేదు. అతణ్ని ఊరిస్తూ, వేచి ఉండమని చెప్తున్నట్టు.. వటపత్ర శాయిలా, అమ్మ సంరక్షణలో హాయిగా బజ్జున్నాడు ఆ బిడ్డ. ఆ బిడ్డ గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు అతను.

* * *

ఉదయం ఆరు గంటలు. డా.రావుకు మెలకువ వచ్చింది. కళ్లు తెరవగానే, అరచేతులు చూసుకుంటూ..

''కరాగ్రే వసతే లక్ష్మీ..'' శ్లోకం చదువుకొని, తర్వాత భూదేవికి క్షమాపణలు చెప్పుకొని, ఆ తర్వాత దేవుడి గదిలోని చిత్రపటాలకు నమస్కరించడం అతని రోజువారీ అలవాటు. ఈరోజు మాత్రం ముందుగా సుజాత ముఖాన్ని చూడాలనిపించింది అతనికి. మెల్లగా కళ్లు తెరిచి సుజాత ముఖాన్ని చూశాడు. తృప్తిగా, హాయిగా అనిపించింది అతనికి.

సుజాత కళ్లు ఎర్రగా ఉన్నాయి. ఆమెకు రాత్రంతా నిద్రలేదు. కంటిమీద కునుకు లేకుండా, బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటూ కూర్చుంది. డా.రావు నిన్న రాత్రి పడుకున్న తర్వాత మధ్యలో మూడుసార్లు లేచాడు. ఆ మూడుసార్లూ అతనికి కనిపించిన దృశ్యం ఒక్కటే!

అతను నిద్రపోయే ముందు, బిడ్డ పక్కన సీట్‌మీద కూర్చున్న సుజాత.. ఆ తర్వాత అక్కడ లేదు. రెండు సీట్లకు మధ్యలో న్యూస్‌పేపర్ పరుచుకొని, బిడ్డవైపు తిరిగి కూర్చుంది. ఒక చేతిని బిడ్డ తల దగ్గర, మరో చేతిని కాళ్ల దగ్గర పెట్టి.. బిడ్డనే చూస్తూ కనిపించింది రాత్రంతా. రైలు కుదుపులకు, నిద్ర వల్ల బిడ్డ జారి పడి పోకూడదని సుజాత ఆరాటం. ఆ చిన్నారి నిద్రా సామ్రాజ్యంలోకి ఏ శత్రువూ రాకుండా స్వయంగా కాపలా కాసింది. ఆమె తల్లి ప్రేమ పక్వానికొచ్చి, పండి, కళ్లల్లో రాలినట్టు సుజాత కళ్లు ఎరుపెక్కాయి.

ట్రైన్ గూడూరు సమీపంలో సిగ్నల్ కోసం ఆగింది. సుజాత మొహంలో ఆందోళన! తిరుపతిలో రైలు దిగిన తర్వాత బిడ్డకోసం పాలు తీసుకోవాలనుకుంది ఆమె. కానీ బండి గంటన్నర ఆలస్యంగా నడుస్తున్నది. పాలు తప్పనిసరి. ఒకసారి బయటికి చూసి వెంటనే కిందికి దిగి పోయింది. పోచయ్యతోపాటు డా.రావు కూడా ఆమె ఏం చెయ్యబోతున్నదా అని చూస్తున్నారు.

అవతలి వైపు ప్లాట్‌ఫామ్ మీద ఒక పుష్‌పుల్ ప్యాసింజర్ ఆగివుంది. ఆ బండికి తిరుపతి బండి ఆగిన ట్రాక్‌కూ మధ్యలో మరో ట్రాక్ ఉంది. ఆ ట్రాక్ దాటుకొని వెళ్లి, పుష్‌పుల్ బండిలో టీ-కాఫీ అమ్ముకునే వాళ్ల దగ్గర పాలు తీసుకోవాలన్నది సుజాత ఆలోచన. మధ్యలో ఉన్న ట్రాక్‌ను దాటి ప్యాసింజర్‌లోని ఒక్కో బోగీలో టీ అమ్మేవాళ్లు ఉన్నారేమో చూసుకుంటూ నడుస్తున్నది. ప్యాసింజర్ చివరి బోగీ వరకూ వెళ్లిపోయింది. అక్కడ ఆమెకు పాలు దొరికాయి. అదంతా గమనిస్తున్న డా.రావుకు గుండె దడ పట్టుకుంది.

'ఇప్పుడు బండి కదిలితే పరిస్థితి ఏంటి? మధ్యలో ఉన్న ఖాళీ ట్రాక్ మీద వేరే ట్రైన్ వస్తే?' డా.రావుకు చెమటలు పట్టేశాయి. అతను భయపడ్డట్టే తిరుపతి బండికి రెడ్ సిగ్నల్ నుంచి ఎల్లో సిగ్నల్ వచ్చింది. చూస్తూ ఉండగానే ఎల్లో సిగ్నల్ గ్రీన్ అయ్యింది. అక్కడ సుజాత ఇంకా చిల్లర తీసుకుంటూ ఉన్నది. గార్డ్ విజిల్ ఊదాడు. ఇంజిన్ నుంచి హారన్.

డోర్ దగ్గర నిలబడి చూస్తున్న డా.రావు క్షణంలో ఒక ఆలోచనకొచ్చాడు. సుజాత తమ కోచ్ దగ్గరికి చేరుకోవడం జరిగేపని కాదు. ట్రైన్ కదిలేవరకు ఆగి.. కదలగానే చైన్ లాగి బండిని ఆపాలనీ, తర్వాత ఫైన్ తానే కట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. గార్డ్ మళ్లీ విజిల్ వేశాడు. ఇంజిన్ నుంచి మళ్లీ హారన్. డా.రావు కళ్లు మూసుకున్నాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంటున్నది. క్షణాలు గడుస్తున్నాయి. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు.

''సార్.. జర తొవ్వ ఇయ్యురి!''..


ఆ మాటలకు డా.రావు ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. ఎదురుగా పాల సీసాతో సుజాత. పక్కకు జరిగాడు. సుజాత లోపలికి ఎక్కిన మరుక్షణం బండి బయల్దేరింది.

''అంతదూరం వెళ్లిపోయావు. గార్డ్ విజిల్, బండి హారన్ ఏమీ పట్టించుకోలేదు నువ్వు. మధ్యలో వేరే బండి వచ్చి, మన బండి కదిలిపోతే ఏం చేసేదానివి? ఏంటీ ఆ మొండితనం? చూసుకోవాలి కదా?''.. కాస్త చనువు తీసుకొని సున్నితంగా మందలించాడు రావు.

అందులో మందలింపు కంటే ఆత్మీయత, అభిమానమే వినిపించాయి సుజాతకు.

''అవునా సార్! అయ్యో మాఫ్ జేయుండ్రి! మీరు మా గురించి ఇంతగా అర్సుకుంటరని అనుకోలే. నేను బండి గురించి, దేని గురించి ఆలోసించలే. బిడ్డకు పాలు ఎట్ల దేవాల్నని ఆలోచన ఒక్కటే ఉండె!''.

'మనిషి ఒక మంచి కోరికను మనస్ఫూర్తిగా, బలంగా కోరుకున్నప్పుడు దానిని నెరవేర్చడానికి, నిజం చేయడానికి ప్రకృతి తనలో సర్దుబాట్లు చేసుకుంటుంది. విశ్వం తనను తాను పునర్నిర్మించుకుంటుంది'.. యోగా సెషన్స్‌లో వరంగల్ కిట్స్ ప్రొఫెసర్ డా.నరేందర్ రెడ్డి పదేపదే చెప్పిన మాటలు గుర్తొచ్చాయి డా.రావుకు. ఆ మాటలు నిజమేనని నమ్మకం ఇప్పుడు కలిగింది.



'సుజాత దూరంగా ఉంది. ట్రైన్ కదులుతున్నది. ఆమె ఎక్కలేదు.. చైన్ లాగాలి, ఫైన్ కట్టాలి!' ఇలాంటి ప్రతికూల ఆలోచనలే చేశాడు రావు. కానీ సుజాత తన బిడ్డకు తప్పకుండా పాలు కావాలనే నిస్వార్థ కోరికను, పరిసరాలను కూడా మర్చిపోయేటంత బలంగా కోరుకుంది. ఆ తల్లి ప్రేమ ముందు, కోరిక ముందు ప్రకృతి పులకించి, విశ్వం ఆనందంగా తనను తాను పునర్నిర్మించుకుంది. ట్రైన్ కదలకపోడానికి కారణాన్ని తనలో తానే విశ్లేషించుకున్నాడు డా.రావు.

ట్రైన్ శ్రీకాళహస్తి దాటింది. తిరుపతి చేరుకోడానికి ఇంకో 45 నిమిషాలే ఉంది. ఈలోగా సుజాత గారాలపట్టిని మనసారా చూడాలనే కోరిక డా.రావులో క్షణక్షణానికీ బలపడుతున్నది. కొని తెచ్చిన పాలు పట్టించాలంటే.. ఇప్పుడు ముసుగు తొలగించాలి కదా. ఆ క్షణం కోసం కాచుకున్నాడు అతను.

''మామా.. బిడ్డకు పాలు తాపిస్తా. సిట్టి అటుయిటూ పోకుండా చూస్కో!''..

సుజాత మాటలు విన్న డా.రావుకు ఎగిరి గంతేసినట్టయ్యింది. కళ్లు పెద్దవి చేసుకొని పాతబట్ట కింద పవ్వళిస్తున్న చిన్నారి దర్శనం కోసం ఎదురు చూస్తున్నాడు అతను. సుజాత బయట ఉన్న చిన్నచిన్న వస్తువులను బ్యాగుల్లో సర్దుకుంటున్నది తప్ప.. పాలు పట్టించే ప్రక్రియ మొదలుపెట్టలేదు.

''ఇగో మామా.. ఇంటున్నవా? బిడ్డకు పాలు తాపిస్తా.. సిట్టి అటుయిటూ పోకుండా చూస్కో!''..

సుజాత మాటకు ఆలోచనలో పడ్డాడు డా.రావు. ఆ మాట రెండుసార్లు చెప్పడంతో.. అది పోచయ్యకు కాకుండా పరోక్షంగా తనకే చెబుతున్న భావన కలిగింది.

'బహుశా ఇప్పుడు తెచ్చిన పాలు కాకుండా.. తల్లిపాలే పడుతుందేమో!? ఎదురుగా నేనుంటే.. ఆ అసౌకర్యాన్ని, ఇబ్బందిని ఆమె ఆ రకంగా తెలియచేస్తున్నట్టు ఉంది!' అనుకున్నాడు డా.రావు. ఒకింత సిగ్గుపడ్డాడు. లేచి యథాలాపంగా వెళ్తున్నట్టు డోర్ దగ్గరికి వెళ్లి నిలబడ్డాడు. బన్నూ అతణ్ని అనుసరించింది.

పావుగంట గడిచింది. బన్నూని పంపి.. పాలు తాగించడం పూర్తయ్యిందో లేదు చూసి రమ్మన్నాడు డా.రావు. పూర్తి అయ్యిందని సైగ చేశాక వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. బిడ్డవైపు చూశాడు. పైన కప్పిన బట్ట మారింది. లోపల కదులుతున్న అలికిడి. అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారి పోవడంతో డా.రావు నిరాశపడ్డాడు. ఈసారి డా. నరేందర్ రెడ్డి మాటల్ని మళ్లీ గుర్తు చేసుకుంటూ.. బిడ్డను చూడాలనే కోరికను మరింత బలంగా కోరుకొని, విశ్వం ఇచ్చే సమాధానం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు.

కానీ, విశ్వం అంత త్వరగా స్పందిస్తుందని అతను ఊహించలేదు. చిట్టి రూపంలో ప్రకృతి తన సమాధానాన్ని పంపింది. చాలా సేపట్నుంచి తాతయ్య ముందు కూర్చొని ఉన్న చిట్టి, మార్పుకోసం సుజాత సీట్ దగ్గరికి వచ్చింది. చిన్నారి పక్కన కూర్చొని, తల ఆనించి, కప్పి ఉన్న బట్ట పైనుంచే బిడ్డను ముద్దు చేస్తున్నది.

''ఏయ్ సిట్టీ. ఏం జేస్తున్నవే? నిద్ర లేపి పరేషాన్ జేయకు బిడ్డా! గిట్రా''.. పోచయ్య హుంకుతో చిట్టి వేగంగా తల ఎత్తి లేచి నిల్చుంది. చిట్టి తలలోని పాపిట పిన్ను బిడ్డ మీద కప్పిన పాత బట్ట చిరుగుల్లో ఎక్కడో ఇరికింది. చిట్టితో పాటే బట్ట మొత్తం పైకి లేచి వచ్చేసింది.

లోపల నగ్నంగా బిడ్డ. ఊహించని ఆ హఠాత్ సంఘటనకు సుజాత నివ్వెరపోయింది. బన్నూ.. భయంతో కళ్లు మూసుకుంది. డా.రావు బిగుసుకు పోయాడు. బ్రహ్మాండం బద్దలైనట్టు.. బ్రహ్మ రహస్యం బట్టబయలైనట్టు రావు చేష్టలుడిగి చూస్తుండిపోయాడు.

అక్కడ.. సీట్ మీద.. దాదాపు ఒక చిన్న సజీవ ఎముకల గూడు. ఏ మాత్రం కండలేని కాళ్లు చేతులు. వాటి ఎముకలకు బలవంతంగా చుట్టినట్టున్న చర్మం. పుర్రెకు చర్మం పూత పూసినట్టున్న తల. లోతైన కళ్లు. దాదాపు అరచేయి వెడల్పులో ఉన్న పొట్ట.. ఆడ శిశువు. డా.రావుకు కడుపులో తిప్పినట్టు అయ్యింది. 'అలాంటి గొప్పతల్లికి దేవుడు ఇలాంటి బిడ్డనిచ్చాడా?' అనుకున్నాడు. అతను తేరుకోడానికి చాలా సమయం పట్టింది.

''ఏంటమ్మా ఇది?''.. ఏం అడగాలో, ఎలా అడగాలో తెలీక ఆగిపోయాడు డా.రావు. సుజాత పాప మీద బట్ట కప్పుతూ మౌనంగా తలవంచుకుంది.

''ఎప్పట్నుంచి ఇలా?'' మళ్లీ అతనే అడిగాడు.

''పుట్టిన రెండు నెలలసంది సార్!''.

''మరి డాక్టర్స్ ఏమన్నారు?''.

''మంచిగ తిండి పెట్టి అర్సుకుంటే.. కొంతకాలానికి మంచిగైతే కావచ్చు. లేకపోతే గిట్లే ఉండొచ్చన్నరు!''.

''మరి ఇప్పటికి ఎన్ని నెలలైంది?''.

సుజాత ఓసారి అతనివైపు చూసి తల దించుకుంది.

''చెప్పకూడదా?'' రెట్టించాడు రావు.

''మూడున్నరేండ్లు''.

హతాశుడయ్యాడు రావు. తన చెవులను తానే నమ్మలేనట్టు.. మరోసారి కొయ్యబారిపోయాడు.

''మూడున్నర సంవత్సరాలా?'' అతని మాట అతనికే వినిపించనంత చిన్న స్వరంతో అన్నాడు రావు.

అవునన్నట్టు తలూపింది సుజాత.